# భేషైన పని



కథా నిలయం
శ్రీకాకుళం

"విన్నావుట్రా...? "
"ఆ..."
"ఏమిటి? "
"అదేరా, ఇప్పుడు నువ్వన్నమాటే"
"అది కాదురా"
"మరేదిరా? "
"వాడి సంగతేరా"
"ఎవడి సంగతీ? "
"ఇప్పుడిటు వెళ్ళలా"
"ఎవరూ వెంకన్నా? "
ఆ! వాడే, చూశావ్"
"ఏముందిరా చూసేందుకు? వాడి మొహం!"
"లేకేం! వాడి మొహం ఈమధ్య కాస్త కళ కళ్ళాడుతున్నట్టు లేదూ? "
"అవున్లే. అంతేనా? ఇంకేమన్నా? ..."
"వాడెక్కిన స్కూటర్ చూళ్లేదురా"
"ఏముందందులో? "
"కొత్తది గదురా అదీ? "
"అలాగే ఉన్నట్లుందిలే"
అదెలా కొన్నాడనుకుంటున్నావ్? "
"ఏముందీ, డబ్బెట్టి కొనుంటాడు"
"డబ్బెలా వచ్చిందనుకున్నావ్"
"ఎక్కడేనా కన్నం వేసివుంటాడంటావా? "
"అంతటివాడు కాదంటావా? మన అయిదో క్లాసు రోజులు గుర్తులేవురా? "
"లేకేం? "

"అప్పుడోసారి వీడేం చేశాడు? "
"ఊ... ఏం చేశాడూ? "
"నీ పెన్సిలు ఎత్తుకుపోయి గోలీలకమ్ముకోలా? "
"అయితే? "
"ఆ బుద్ధులు ఎక్కడికి పోతయ్యంటావ్"
"ఊ, ఎక్కడికి పోతయ్యంటావ్? "
"అప్పుడు చిల్లర దొంగతనాలు చేశాడా"
"ఊ"
"ఇప్పుడు పెద్ద దొంగవేషాలు వేస్తున్నాడు? "
"ఆ? "
"ఎంత బాగా వేస్తాడనుకున్నావ్? "
"చాలా బాగా అనుకుంటా"
"నీకెలా తెల్సు? "
"మన స్కూలు డ్రామాల్లో చిన్నప్పుడేదో ప్రైజు కొట్టాడు గదరా"
"అది అప్పటిమాట"
"ఇప్పటి మాటేమిటంటావ్"
"మన చంద్రావ్‌గాడు లేడూ"
"లేకేం! బ్రతికే ఉన్నాడుగా"
"వాడికో మామయ్యున్నాడా లేదా"
"ఉండే ఉంటాడు"
"నీకెలా తెల్సు"
"దానిదేముందిరా, పెళ్ళి వయసు వాడికి చాలామంది మామయ్యలుంటారు"
"ఆ మామయ్యో ఎమ్మెల్యే అని తెలుసా? "
"ఒహో"
"ఈ వెంకన్నగాడు ఆ చంద్రావుని పట్టుకొని..."
'ఊ పట్టుకొని"
"ఆ ఎమ్మెల్యే మామయ్యని మంచి చేసుకున్నాడు"
"చేసుకుని? "
"ఆయన్నూ, ఆయన పార్టీని పొగట్టం మొదలెట్టాడు"
"ఊ..."
"ఇతర్లను తిట్టడం మొదలెట్టాడు"
"ఆ తర్వాత"
"రోజూ ఆయన ఇంటికెళ్ళి కబుర్లు కొట్టడం సాగించాడు"
"అలాగా. వాడావిద్యలో అఖండుడేగా"
"వాడంతటితో ఆగాడా. తరవాత్తరవాత రికమండేషన్లు కొట్టుకొచ్చాడు"
"ఎక్కణ్ణించి"
"ఆ చంద్రావ్‌గాడి మామయ్య దగ్గర్నుంచే"
"అలాగా. కొట్టుకొచ్చి ఏం జేశాడంటావ్"

"వాటిని చంకనేసుకెళ్ళి ఓ మంచి ఉద్యోగాన్ని కొట్టేశాడు"

"నిజంగానా? "

"ఏడ్చినట్టుంది, కనపట్టంలా"

"ఏమిటి"

"అదే! ఇందకా వాడెక్కిన స్కూటరు. మొదటి నాలుగు నెల్ల జీతంతో కొన్నాడది"

"అంత పెద్ద ఉద్యోగమా? "

"మరేమనుకున్నావ్, పాతికమందిని కాదని వీడికిచ్చారది"

"గట్టివాడేనన్నమాట"

"వాడి పిండాకూడేం కాదూ. ఇంతేనా నువ్వర్థం చేసుకున్నది"

"చెప్పరాదూ"

"నీ కింకా అర్థంగాలేదా? వాడొట్టి స్వార్థపరుడూ, ఆసాంఘిక శక్తుడూను"

"ఎలాగంటావ్? "

"రికమండేషన్లతో ఉద్యోగం సంపాదించటం సమాజ ద్రోహం కాదురా? "

"అవునవును"

"అది దుష్టసాంప్రదాయం కాదూ? "

"కాబోల్ను"

"వీడి మూలంగా పాతికమందికి అన్యాయం జరగలా? "

"ఎలాగూ? "

"వాళ్లకు డిగ్రీలున్నాయిగాని, రికమండేషన్లు లేవుగా? "

"రికమండేషన్లు లేకపోవటం వాళ్ల ఖర్మ కావచ్చుగా"

"ఏమైనా వీళ్లంతా సంఘానికి చీడపురుగులు."

"ఎవళ్లంతా? "

"ఈ వెంకన్నలూ, చంద్రావులూ, వాడి మామయ్యలూను"

"ఎలాగంటావ్? "

"వీళ్ల మూలంగా సమర్థులైన వాళ్లకి దొరక్కుండా చచ్చువెధవలకు పోవటం లేదుట్రా ఉద్యోగాలు? "

"పోనిద్దూ మనవాడేం అసమర్థుడు కాదుగా"

"అలాగంటే ఎలాగురా! సామాజిక విలువలంటూ ఏమన్నా తగలడాలా లేదా"

"తగలడుతూనే ఉన్నాయిగా"

"మరి ఆర్పవద్దుట్రా"

"ఆర్పుతూనే ఉన్నారుగా"

"ఎవర్రా? "

"అదే! రికమండేషన్లు తెచ్చుకోని ఆ పాతికమందీని"

"నీ ఉద్దేశ్యమేమిటంటావ్? "

"ఎంతైనా మన స్నేహితుడే గదరా వెంకన్న! అయినా వాడికేం లోపం? డిగ్రీ గట్రా ఉన్నాయిగా"

"అయితే నాకేనా లేంది? "

"అలాగని ఎవరన్నారు? "

"మనం అయిదో క్లాసు చదివేప్పుడు నాకు మూడు మార్కులొస్తే, వెంకన్నకు వొచ్చింది రెండు మార్కులేగదరా"

"అవునవును"

"మరివాడు నాకన్నా ఎలా ఎక్కువంటావ్? "

"నేననలేదే"

"అయితే నాకు రాకుండా వాడికెందుకు పోవాలా ఉద్యోగం? "

"ఏమిటేమిటీ? నువ్వుకూడా అప్లికేషన్ పెట్టావా. ఆ ఉద్యోగానికి? "

"మరేమనుకున్నావ్? "

"నువ్విప్పుడు చేస్తున్న ఉద్యోగానికేం రోగం వచ్చిందిరా? "

"నెధవ్వుద్యోగం. బొచ్చెడు జీతమన్నారాదు. దాన్నెలా నమ్ముక్కూర్చోమన్నావు"

"అందుకని మానేశావన్నమాట"

"ఎబ్బే, మానందే"

"అయితే అదుండగానే దీనిక్కూడా అప్లయి చేశావన్నమాట"

"అదీ! అలా దారికి రా"

"పోనిద్దూ. అది వెంకన్నకు పోతేపోయింది. వాడినన్నా కాస్త సుఖంగా ఉండనీ. నీకిది ఉందిగా, పైగా మీ బాబు పెద్ద ఆఫీసర్ కూడానూ."

"ఏం ఉద్యోగంలెద్దూ. బొచ్చెడు జీతమన్నారాదు"

"నీకంత కోరిగ్గా వుంటే నాకింతవరకూ ఎందుకు చెప్పలేదు? "

"నువ్వేం ఆర్చేవాడివా, తీర్చేవాడివా? "

"వినరా నాయనా. మా ఆఫీసులో ఓ పోస్టు ఖాళీ అయ్యింది"

"అయితే? "

"జీతం అప్పారావుకొచ్చినంతా వస్తుంది"

"వస్తే? "

"నీకంత కోరిగ్గా ఉంటే ఎందుకు అప్లయి చేయకూడదు"

"అంత పెద్ద ఉద్యోగం వస్తుందా అని? "

"వెంకన్నకెలా వచ్చిందంటావ్? "

"వాడికి రికమండేషన్లున్నాయి"

"నువ్వూ సంపాదించు"

"ఛా...ఛా....? "

"ఏం...? "

"అంత అప్రాచ్యపుపని నే చెయ్యను"

"నువ్వెక్కడో ఉత్త వెర్రిబాగులవాడిలా ఉన్నావ్"

"కాబోల్ను"

"కాబోల్నేమిటి నీ తలకాయ, ఈ రోజుల్లో చప్రాసీ ఉద్యోగానిక్కూడా సవాలక్ష రికమండేషన్లు కావాల్రా నాయనా"

"కావాలంటావ్"

"ఓరి పిచ్చినాయనా, అవిలేందే నీ మొహం చూసి ఇచ్చేదెవడు? "

"రకమండేషన్లంటే నాకంతగా కోపం లేదనుకో. కాని..."

"ఊ కానీ..."

"నన్నెరిగిన వాళ్లెవరూ లేరే"

"అలాగనుకుంటే ఎలా? వెళ్లి ఎవణ్ణన్నా పట్టు"

"ఎవణ్ణి పట్టాలంటావ్? "

"పట్టవలసినవాణ్ణే పట్టాలి. ఆ సుబ్రావ్ మామయ్య లేడూ..."

"ఊఁ..."

"ఆయనకీ మా ఆఫీసరుకూ స్నేహం లావు. ఆయన్నే పట్టు"

"చేస్తాడంటావా? "

"అంతా నీలో ఉంది. ముందా సుబ్రావ్ను మంచి చేసుకొని తోము"

"తోముతాననుకో, కాని నాకు సందేహంగానే వుంది. ఇంతకాలం ఎంత తోమినా దొరకనివి ఇప్పుడు దొరుకుతాయా? అని"

"అచ్చా... దిగిచూడు తెలుస్తుంది"

"అంతేనంటావా? "

"ఓ, భేషుగ్గా"

☆